పొంచి ఉన్న మరో ముప్పు

- పది నెలలు గడిచినా బుడమేరు కాలువకు పడిన గండ్లను పూడ్చని ప్రభుత్వం
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్న ప్రజలు
- యుద్ధప్రాతిపదికన గండ్లను పూడ్చాలని రైతుల వేడుకోలు



కేసరపల్లి - మంతెన గ్రామాల మధ్య బుడమేరు కాలువకు పడిన భారీ గండి



ఉంగుటూరు మండలంలో కోతకు గురై బలహీనంగా ఉన్న బుడమేరు కాలువ గట్టు

గన్నవరం: గతేడాది బుడమేరు కాలువకు పోటెత్తిన వరద చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా భారీ ఆస్తి, ప్రాణ నష్టం జరిగింది. వరద ప్రవాహం ధాటికి బుడమేరు కాలువ గట్టుకు పలుచోట్ల గండ్లు పడిన కారణంగానే భారీ ముప్పు సంభవించింది. లక్షలాది ఎకరాల పంట పొలాలను, వేలాది నివాస గృహాలను వరద నీరు ముంచెత్తింది. ముఖ్యంగా గన్నవరం నియోజకవర్గంలో బుడమేరు వరద వల్ల అత్యధికంగా రైతులు నష్టపోయారు. ఈ విపత్తును మరువక ముందే బుడమేరు కాలువ వల్ల మరో ముప్పు పొంచి ఉందని నియోజకవర్గ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వరదల వల్ల బుడమేరు కాలువ గట్టుకు గన్నవరం, ఉంగుటూరు మండలాల పరిధిలో పలుచోట్ల గండ్లు పడ్డాయి. కాలువ గట్లు పలుచోట్ల కోతకు గురై బలహీనంగా మారాయి. దీంతో బుడమేరు కాలువకు మరోసారి వరదలు వస్తే తమ పంట పొలాలు, ఇళ్లు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని పరిసర గ్రామాల రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

తీరని నష్టం మిగిల్చింది

గన్నవరం నియోజకవర్గంలో బుడమేరు కాలువ సుమారు 30 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉంది. విజయవాడ రూరల్, గన్నవరం, ఉంగుటూరు మండలాల మీదుగా నందివాడ మండలంలోకి కాలువ ప్రవేశిస్తుంది. గతేడాది సంభవించిన వరదలకు నియోజకవర్గంలోని బుడమేరు పరిసర గ్రామాలు ఎక్కువగా ముంపు బారినపడ్డాయి. ముఖ్యంగా రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, కేసరపల్లి, తరిగొప్పుల, వేంపాడు, వెల్దిపాడు, చాగంటిపాడు, ఎలుకపాడు, లంకపల్లి, ఓంద్రపాడు, ఉంగుటూరు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, ముక్కపాడు గ్రామాల్లో ఎక్కువగా పంట పొలాలు, ఇళ్లు నీట మునిగాయి. వరద ముంపు వల్ల రైతులు తమ పంటలను పూర్తిగా కోల్పోయారు. నివాస గృహాలు ముంపునకు గురైన ఆయా గ్రామాల ప్రజలు రోజుల తరబడి పునరావాస కేంద్రాల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. విజయవాడ రూరల్ మండల పరిధిలో కాలువ ఆక్రమణలకు గురై కుంచించుకుపోవడం కూడా వరద నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది.

ఏడాది గడుస్తున్నా పూడ్చని గండ్లు

నియోజకవర్గ పరిధిలో జక్కులనెక్కలం, కేసరపల్లి-మంతెన గ్రామాల మధ్య, తరిగొప్పుల-వేంపాడు గ్రామాల మధ్య ఎక్కువగా బుడమేరు కాలువ గట్లకు గండ్లు పడ్డాయి. మరికొన్ని చోట్ల కాలువ గట్లు కోతకు గురై గండ్లు పడేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ విపత్తు సంభవించి ఏడాది గడుస్తున్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు బుడమేరు కాలువ గట్లకు పడిన గండ్లను ఇంతవరకు పూడ్చలేదు. గత వేసవిలో మరమ్మతులు చేస్తారని రైతులు ఎదురుచూసినప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలేమి జరగలేదు. ఇంతలోనే వర్షాకాలం రావడం, ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతుల్లో మళ్లీ ఆందోళన ప్రారంభమైంది. బుడమేరు కాలువకు మరోసారి వరదలు వస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన బుడమేరు కాలువకు పడిన గండ్లను పూడ్చాలని కోరుతున్నారు.

సత్వరమే గండ్లు పూడ్చాలి



గత ఏడాది వరదల వల్ల కేసరపల్లి-మంతెన గ్రామాల మధ్య బుడమేరు కాలువ గట్టుకు భారీ గండి పడింది. దీనివల్ల కేసరపల్లి గ్రామ పరిధిలోని వేలాది ఎకరాల పంట పొలాలు ముంపుబారిన పడి భారీగా నష్టపోయాం. ఇంతవరకు ఇరిగేషన్ అధికారులు ఆ గండిని పూడ్చలేదు. దీనివల్ల పరిసర ప్రాంత రైతులంతా ఆందోళన చెందుతున్నారు. సత్వరమే గండిని పూడ్చాలి.

–మేడూరి పుష్పనాథం, రైతు, కేసరపల్లి

ఎడతెగని నిర్లక్ష్యం



ఉంగుటూరు మండల పరిధిలో బుడమేరు కాలువకు పలుచోట్ల గండ్లు పడడం కారణంగానే ఎక్కువ గ్రామాలు, వేలాది ఎకరాల పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ప్రతి ఏటా బుడమేరు కాలువ వరదల వల్ల రైతులు నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. కనీసం కాలువకు పడిన గండ్లను కూడా పూడ్చకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.

–ఆజ్మీరా వెంకటేశ్వరరావు, రైతు సంఘ నాయకుడు, ఉంగుటూరు

దోమల నివారణకు చర్యలు

రామవరప్పాడు: మంలో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు రామవరప్పాడు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామంలో దోమలకు నిలయాలుగా మారిన పలు అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లలో గురువారం పూడికతీసి బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. పౌరుదలకు నోచుకోని డ్రెయిన్లను, చెత్త డంపింగ్ చేసే ప్రాంతాలను పరిశీలించి తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు. గ్రామంలోని ఖాళీ స్థలాలను గుర్తించి చెత్త డంప్ చేయకుండా, మరుగు నిల్వ లేకుండా మెరక తొలించుకోవాలని యజమానులకు సూచించామన్నారు. గ్రామస్తులు కూడా తమ నివాస పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త రోడ్లపై డంప్ చేయకుండా ఉండేందుకు సహకరించాలని కోరారు. దోమల నివారణకు డ్రెయిన్లలో త్వరలో ఆయిల్ బాల్స్ వేయిస్తామని తెలిపారు.

ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలి

కంకిపాడు: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.ఉషారాణి బాబూరావు సూచించారు. స్థానిక తన కార్యాలయంలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. బీమా చేయిస్తే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పరిహారం లభిస్తుందని సూచించారు. కృష్ణాజిల్లాకు దిగుబడి ఆధారంగా బీమా వర్తిస్తుందని, వరికి గ్రామం యూనిట్‌గా ఎకరాకు రూ.830 బీమా ప్రీమియం చెల్లించాలని పేర్కొన్నారు. పసుపు పంటకు జిల్లా యూనిట్‌గా ఎకరాకు రూ.1100 చొప్పున రైతులు ప్రీమియం చెల్లించాలన్నారు. ఆగస్టు 15వ తేదీతో వరికి, ఈ నెల 31వ తేదీతో పసుపు పంటకు బీమా చెల్లింపునకు తుది గడువని వివరించారు. రైతులు కామన్ సర్వీస్ సెంటర్లు, సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు, పీఏసీఎస్, పోస్టాఫీసుల్లో ఆధార్, భూమి ధ్రువీకరణ పత్రాలు సమర్పించి ఆన్‌లైన్ ద్వారా ప్రీమియం చెల్లించి రశీదు పొందాలని సూచించారు.

గౌడపేట వాసులను వేధిస్తున్న డ్రెయినేజీ సమస్య



పిచ్చిమొక్కలతో నిండిన డ్రెయిన్

గన్నవరం: స్థానిక గౌడపేటలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కొంత కాలంగా కాలనీలోని డ్రెయిన్లలో పూడికలు తొలగించడం లేదు. దీనికితోడు డ్రెయిన్లలో పిచ్చిమొక్కలు, పచ్చగడ్డి దట్టంగా పెరిగాయి. ఫలితంగా మురుగునీటి పారుదలకు ఆటంకంగా మారాయి. మురుగు నీరు రోజుల తరబడి నిల్వవేయడంతో దోమల బెడద ఎక్కువైందని గౌడపేట వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధరణంగా గౌడపేటలోని కొంత భాగం మురుగు మెయిన్ డ్రెయిన్‌లోకి, మిగిలిన మురుగు తోడేపాడు చెరువులో కలుస్తుంది. తోడేపాడు చెరువు పూర్తిస్థాయిలో నిండడంతో మురుగునీరు వెనక్కి తన్నుతోందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ సాయం



గోసాలలో ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచి శ్రీనివాసరావు

పెనమలూరు: మండలంలోని గోసాల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడు షేక్ నాగుల్ మీరావలి ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి పార్టీ ఆర్థిక సాయం అందించింది. గత నెల 14వ తేదీన ప్రమాదవశాత్తు నాగుల్‌మీరావలి మృతి చెందటంతో పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి బాధిత కుటుంబాన్ని పరిమర్శించి ఆర్థిక సాయం గురువారం ప్రకటించారు. సర్పంచి సంగెపు శ్రీనివాసరావులు ఈ మేరకు రూ.12 వేలు బాధిత కుటుంబానికి సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పోలవరపు రవి, ఎండీ ఆసీఫ్, భువనగిరి రమణమూర్తి, నేతలు నక్కా వినోద్, హాజీఆలీ, జోగి వెంకటేశ్వరరావు, రామిశెట్టి వెంకట్రావు పలువురు పాల్గొన్నారు.

పీఎన్‌బీ ఖాతాదారులకు విస్తృత సేవలు



మెగా రిటైల్ మెళాలో పాల్గొన్న పీఎన్‌బీ బ్యాంక్ జీఎం నీలిమ, ఇతర అధికారులు

పెనమలూరు: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) ఖాతాదారులకు విస్తృత సేవలు అందిస్తూ ముందంజలో ఉందని బ్యాంక్ జనరల్ మేనేజర్ వి.నీలిమ తెలిపారు. పోరంకిలో గురువారం మెగా రిటైల్ మేళా జరిగింది. ఈ సందర్భంగా జీఎం నీలిమ మాట్లాడుతూ.. తక్కువ వడ్డీ రేట్లతో గృహ, వాహన, ఆస్తి తనఖా, విద్య, బంగారు ఆభరణాలపై రుణాలు ఇస్తున్నామని వివరించారు. బ్యాంక్ యాప్ ఆన్‌లైన్ ద్వారా కూడా రుణ సేవలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురికి రుణాల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్‌కుమార్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామనాథం, బిక్షపతి, ముఖ్య అధికారులు, సర్కిల్ పరిధిలోని బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



గన్నవరంలో ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు



కంకిపాడులోని ఓ ఎరువుల దుకాణంలో స్టాకును లెక్కిస్తున్న విజిలెన్స్ అధికారులు

గన్నవరం: స్థానికంగా ఉన్న ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో గురువారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ డీఎస్పీ బంగారురాజు నేతృత్వంలో ఎరువుల దుకాణాల్లో స్టాక్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎరువులు, పురుగు మందుల విక్రయాలకు సంబంధించి సరైన బిల్లులు లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీకే విక్రయించాలని సూచించారు. స్టాక్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, బిల్లులు సక్రమంగా లేకపోయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజమండ్రి ఏడీఏ చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. తొలుత స్థానికంగా ఉన్న రెండు ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుల్లో కూడా అధికారులు సోదాలు జరిపారు.

కంకిపాడులో..

కంకిపాడు: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం రాత్రి తనిఖీలు చేశారు. విజిలెన్స్ డీఎస్పీ బంగార్రాజు నేతృత్వంలోని ప్రత్యేక బృందం కంకిపాడులోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించింది. స్టాకు రిజిస్టరులో స్టాకు, అందుబాటులో ఉన్న స్టాకు వివరాలు సరిపోయాయో లేదో లెక్కించింది. ఎంఆర్‌పీకి ఎరువులు విక్రయిస్తుందీ? లేనిదీ? సమాచారం సేకరించింది. తనిఖీల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ చంద్రశేఖర్, గన్నవరం డివిజన్ ఏఓ లంక శ్రీనివాస్, కంకిపాడు మండల వ్యవసాయాధికారి వి.ఉషారాణి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైల్వే ఉద్యోగికి గాయాలు

పెనమలూరు: మండలంలోని పోరంకి వద్ద జరిగిన రోడ్డు ప్రమదంలో రైల్వే ఉద్యోగి ఒకరు గాయపడ్డారు. ఈ ప్రమాదంపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. కంకిపాడుకు చెందిన రైల్వే ఉద్యోగి కె.లక్ష్మీనారాయణ, అలివేలుమంగమ్మ దంపతులు విజయవాడలో బంధువుల అంత్యక్రియలకు హాజరవడానికి కారులో బయలుదేరారు. పోరంకి వద్దకు వచ్చిన తరువాత మందులు కొనటానికి లక్ష్మీనారాయణ కారు ఆపి బందరు రోడ్డు దాటి వెళ్లి మందుల షాపులో మందులు కొన్నాడు. తిరిగి కారు వద్దకు వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు ఉంచి వచ్చిన బైక్ అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మీనారాయణ గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆర్యవైశ్య సంఘం హనుమాన్‌జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం జరుగుతుందని సంఘం నాయకులు గురువారం తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఈ శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. ఒమెగా అను హాస్పిటల్స్ వైద్యులు ఈ శిబిరంలో రోగులకు వైద్య సేవలు అందిస్తారని వివరించారు. గుండె, కిడ్నీ, ఎముకలు, కీళ్లు, బీపీ, షుగర్ సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. హనుమాన్‌జంక్షన్ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

19న ఎనికేపాడులో పీజీఆర్ఎస్

విజయవాడరూరల్: రూరల్ మండలంలోని ఎనికేపాడు గ్రామంలో ఈ నెల 19వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరుగుతుందని ఎంపీడీఓ బి.విగ్గిన్స్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఐదు గంటలకు ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజ్ ప్రాంగణంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు.

సొసైటీ ద్వారా రైతులకు సేవలందించడమే లక్ష్యం



బాధ్యతలు స్వీకరిస్తున్న కలకోటి శ్రీనివాసరెడ్డి

నున్న(విజయవాడరూరల్): రైతులకు సేవలందించడమే లక్ష్యంగా నున్న వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం పని చేస్తుందని త్రిసభ్య కమిటీ ఛైర్మన్ కలకోటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ చైర్మన్ కలకోటి శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్లుగా పామర్తి శ్రీనివాసరావు, గంపా శ్రీనివాసరావు పదవీ బాధ్యతలను గురువారం స్వీకరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నున్న సొసైటీ రైతులకు సేవలందించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి భూక్యా శ్రీనివాసరావు, కేడీసీసీ సత్యనారాయణపురం చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు, మాజీ డైరెక్టర్ గుంటక చిన వెంకటరెడ్డి, భూముల బాలశేఖర్‌రెడ్డి, గుంటక ప్రభాకరరెడ్డి, నున్న సీఈఓ తాడంకి రమేష్, మాజీ డైరెక్టర్ బొంతు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచి కాటూరి సరళ, పంచాయతీ కార్యదర్శి కోట సురేష్‌బాబు త్రిసభ్య కమిటీ సభ్యులను అభినందించారు.

లక్ష్మణ్‌దత్ విగ్రహావిష్కరణ



లక్ష్మణ్‌దత్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఇందిరాదత్

పెనమలూరు: మండలంలోని కానూరు సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ ప్రాంగణంలో ది కేసీపీ లిమిటెడ్ మాజీ చైర్మన్ డాక్టర్ వెలగపూడి లక్ష్మణ్‌దత్ విగ్రహాన్ని కేసీపీ చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన, విద్యాభివృద్ధికి దత్ చేసిన సేవలు మరువలేనివన్నారు. కేసీపీ జాయింట్ డైరెక్టర్ వి.కవితాదత్ మాట్లాడుతూ.. లక్ష్మణ్‌దత్ విద్యకోసం చేసిన కృషి నేడు సత్ఫలితాలను ఇస్తోందన్నారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ.. డాక్టర్ దత్ విద్య కోసం చేసిన కృషి నేడు ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌కు దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో కేసీపీ టెక్నికల్ డైరెక్టర్ చిట్టూరి రవి, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, వైస్ చాన్స్‌లర్ పి.వెంకటేశ్వరరావు, ప్రో వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఎ.వి.రత్నప్రసాద్, డైరెక్టర్ పాండురంగారావు, రిజిస్ట్రార్ రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

డీహైడ్రేషన్ వల్లే విద్యార్థినులకు అస్వస్థత!



విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీవైఈఓ, ఎంఈఓ-2

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం గుడివాడ డివిజనల్ ఉప విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్ విచారణ నిర్వహించారు. పాఠశాలలో బుధవారం ఆహారం కలుషితమై ముగ్గురు పిల్లలు అస్వస్థతకు గురయ్యారని వార్తలు వచ్చిన నేపథ్యంలో వారు విచారణ చేపట్టారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో వేర్వేరుగా సమావేశమై వివరాలు సేకరించారు. ఒక విద్యార్థిని అనారోగ్య సమస్యలతో, మరో ఇద్దరు విద్యార్థినులు అధిక ఉష్ణోగ్రతల కారణంగా డీహైడ్రేషన్‌కు గురై కళ్లు తిరిగినట్లు వారి తల్లిదండ్రులు వివరణ ఇచ్చారు. హెచ్ఎం, ఉపాధ్యాయుల సమాచారం మేరకు తమ పిల్లలను పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వివరణను లిఖితపూర్వకంగా తీసుకున్న డీవైఈఓ కొండా రవికుమార్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఎంఈఓ-2 ఎం.కమల తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం పది గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ బి.విగ్గిన్స్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో ఈ సమావేశం జరుగుతుందని వివరించారు. ఎంపీటీసీ సభ్యులు, ప్రభుత్వ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

వరి సాగులో మెలకువలు పాటించాలి



పెనమలూరు: వరి సాగులో రైతులు మెలకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి కనక మేడల శైలజ సూచించారు. గంగూరు, తాడిగడప గ్రామాల్లో గురువారం పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వరి నాట్ల సమయంలో రైతులు సకాలంలో ఎరువులు ఉపయోగించాలన్నారు. నాటిన వరికి చాలినంత నీరు అందించాలని సూచించారు. నీటి యాజమాన్యం సక్రమంగా పాటించాలన్నారు. పంటల బీమా పథకాన్ని రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు. వరికి రూ.830, పసుపునకు రూ.1100 చొప్పున రైతులు బీమా ప్రిమియం చెల్లించాలన్నారు. వరికి వచ్చే నెల 15వ తేదీ నాటికి బీమా చేసుకోవాలన్నారు. ఎన్‌పీసీ పోర్టల్ లేదా మీ-సేవ కేంద్రాల్లో బీమా చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై అభ్యంతరం



నున్న(విజయవాడరూరల్): గ్రామంలో పడమర రామాలయం సమీపంలో డ్రెయిన్‌పై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రామాలయం వంటశాలకు ఆనుకుని ఇప్పటికే ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచి విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఏఈ ఎ.శివారెడ్డిని వివరణ కోరగా ప్రజల నుంచి అభ్యంతరాలు ఉంటే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయబోమన్నారు.

ఘనంగా కార్మెల్‌మాత మహోత్సవాలు



పెనమలూరు: మండలంలోని కానూరులో కార్మెల్ మాత మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల ఏడో తేదీ నుంచి నవదిన ప్రార్థనలు ప్రారంభించారు. బుధవారం రాత్రి ఫాదర్ సలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో ఘనంగా మహోత్సవాలను ముగించారు. తొమ్మిది రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో ఫాదర్లు క్రైస్తవ కుటుంబాలలో గౌరవం, విధేయత, ప్రేమ కుటుంబ ప్రార్థనల గురించి వివరించారు. చివరి రోజు కార్మెల్‌మాత మహోత్సవ సమాప్తి దివ్యబలి పూజలు చేశారు. ఈ సందర్భంగా 40 మంది చిన్నారులకు దివ్య ప్రసాదం, 30 మంది నూతన వధూవరులకు జ్ఞానస్నానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు బొల్లిబొండ జయరాజు, ఫాదర్ విజయ్, ఫాదర్ ఇంటూరి సునీల్, ఫాదర్ కెవిన్, మైత్రి దేవదానం, రత్నరాజు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి



కంకిపాడు: రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారు. తెన్నేరు పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం తెన్నేరులో జరిగింది. సొసైటీ అధ్యక్షుడుగా గద్దె నాగేశ్వరరావు, డైరెక్టర్లుగా సూరపనేని మురళి, కొండవీటి శ్రీను ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గొంది శివరామకృష్ణప్రసాద్, విజిలెన్స్ విభాగం సభ్యుడు తుమ్మలపల్లి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా పంచకర్ల చక్రవర్తి



హనుమాన్‌జంక్షన్ రూరల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ నూతన అధ్యక్షుడిగా మెడివ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఎండీ పంచకర్ల చక్రవర్తి ఎన్నికయ్యారు. 2025-26 సంవత్సరానికి గానూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా పంచకర్ల చక్రవర్తి, ప్రధాన కార్యదర్శిగా మాకినేని శ్రీనివాసరావు, కోశాధికారిగా అక్కినేని రాఘవేంద్రరావు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరుగుతుందని పేర్కొన్నారు.

వడ్డెర రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వినతి



గుడివాడటౌన్: ఆంధ్రప్రదేశ్ వడ్డెర ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మహాసభలను జయప్రదం చేయాలని సంఘం నాయకులు కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మహాసభల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 27, 28 తేదీల్లో నెల్లూరులో ఈ మహాసభలు జరుగుతాయన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వడ్డెర కుటుంబాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా పోరాడాల్సిన బాధ్యత వడ్డెర కుటుంబ సభ్యులకే ఉందన్నారు. దీనిపై మహాసభల్లో చర్చిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు సీహెచ్ శివనాగ మల్లేశ్వరరావు, ఆర్.కొండ, బండి శ్రీను, సీహెచ్.రాంబాబు, టి.దుర్గారావు, సీహెచ్. తిరుపతి, ఆర్. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.